# వలపుల్లో మలుపు

గౌరికి చీరెలు కొందామని ఏడాది నుంచి ప్రయత్నం. జీతపు రాళ్ళు చేతిలో పడగానే లెక్క వేసుకుంటూ కూర్చుంటాడు. తన ఖర్చులు తగ్గించుకుంటూ నెలకు రెండు మూడు రూపాయలు మిగల్చమంటే సామాన్యమైన విషయంగా కనిపించటంలేదు వెంకటస్వామికి. బస్తాలమీద బస్తాలు వీపుమీద ఎత్తుకుంటూ పగలల్లా ఫ్యాక్టరీలో పనిచేస్తేనే, తనకు తన భార్యకు సరిపడ్డ తిండిగింజలు దొరుకుతాయి. యౌవనంలో వున్న ఆ దంపతులిద్దరికీ కూడా చిత్రవిచిత్రమైన కోరికలున్నాయి. అన్నీ డబ్బుతో తీరేవే! మరి అదేలేదు. గౌరంటే పంచప్రాణాలూను. తన భార్యను తాను సుఖపెట్టలేక పోతున్నానేమోనని. నిత్యమూ అతను

మానసిక బాధ అనుభవిస్తూనే వుంటాడు. తన భర్త చేస్తున్న వెట్టిచాకిరి తనకోసమేకదా అని గౌరి అనుక్షణం దిగులుపడుతూ వుంటుంది. తాను పనిలో ప్రవేశిస్తానంటే మాత్రం ఆతను ససేమిరా ఒప్పుకోనే ఒప్పుకోడు. ఇద్దరూ కూడా ఒకరికి తెలియకుండా ఒకరు బాధపడుతూనే వున్నారు. మళ్లీ ఇద్దరూ కూడా అతిసన్నిహితంగా వచ్చేసి ఒకరి ఆకర్షణలో ఒకరు ముగ్ధులయిపోతూ వుంటారు.

అసలు వెంకటస్వామికి ఒక గర్వం కూడా వుంది. తన భార్య అందగత్తె అని. తన అదృష్టం కొద్దీ ఆమె దొరికిందని అతని గాఢ విశ్వాసం. తన భార్య ఏవిధంగానూ కందిపోకుండా చూచుకుంటూ వుంటాడు. ఇంకా ఎక్కువ చాకిరిచేసి డబ్బు సంపాదించి ఆమెను సుఖ పెట్టాలని నిత్యమూ తాపత్రయపడుతూ వుంటాడు. ఆమె అందానికి తగ్గ ఒక చీర కొనాలని, అది తన భార్య కట్టుకుని నలుగురూ చూస్తేలాగున బజారుకు వెళ్లాలని అతనికోరిక. ఆమె అందంలో తన గర్వం వుంది. ఆమె యౌవనంలో తన కోరికలు వున్నాయి. ఆమె చిరునవ్వులో తన భవిష్యత్తు వుంది. ఆమె సొగసులో తన వలపు వుంది.

దుమ్మూ,ధూళీ, కొట్టుకుని ఇంటికి రాగానే స్నానానికి నీళ్లు తోడుతుంది. శ్రమచాటున మరుగుపడ్డ తన భర్త అందాన్ని తనివితీరా చూస్తూ మురిసిపోతుంది, అబ్బ ! అతను ఎంత అందగాడు అనుకుంటుంది. ఎదురుగా కనిపిస్తున్న మేడలోకి తన దృష్టులు పోతాయి. ఆయనెవరో తెల్లటి మల్లుధోవతి కట్టుకొని వుంటాడు. నిజంగా అలాంటి ధోవతి, తన భర్త శరీరపు ఛాయకు ఎంతో అందాన్ని ఇస్తుంది. ఆ మల్లుధోవతి,తెల్లటి లాల్చి, తన భర్త శరీరం మీద చూడాలని గౌరి తెగ ఉబలాటపడి

పోతుంది. ఈ కోరిక తన భర్తకు చెపుతే తీర్చడు. సరికదా ఏదో అంటాడు. తనమీద తాను ఎక్కువ శ్రద్ధ చూపడని గౌరికి బాగా తెలుసు. తన భర్త కళ్ళల్లో ఆప్యాయత, ఆ కంఠంలో మాధుర్యం, ఆమె అట్టే మనన చేసుకుంటూ కూర్చుంటుంది.

ఇక వెంకటస్వామి ఇంటికి వచ్చేలోగా బజార్లో కనబడ్డ రకరకాల చీరలు పరీక్షగా చూస్తూ వస్తాడు. ఏ చీరె తన భార్యకు అందాన్నిస్తుందో అని కళ్లు విప్పుకుని మరీ చూస్తూ వుంటాడు. ఇంటికి వచ్చేటప్పటికి రకరకాల చీరెల రంగులు గజిబిజిగా కళ్ళల్లో మెరిసి తికమకపడిపోతాడు. ఒక్కక్షణం తన భార్య కళ్ళల్లోకి నిలకడగా చూసి లోపలకు వెళ్ళి పోతాడు. ఇద్దరూ కూడా ఒకరినిచూసి ఒకరు ఒళ్లుతెలియని ఆనందంలో మునిగిపోతూ వుంటారు.

తాను నెలనెలా కూడబెట్టుతున్న డబ్బు రోజుకు ఒకసారయినా లెక్కపెడుతూ వుంటాడు. అబ్బ! ఇంకా ఇంతేనా! అని నిస్పృహ పడుతూ వుంటాడు. విసుక్కుంటాడు, బాధపడతాడు, తీవ్రంగా ఆరాట పడతాడు, తన భార్య, తాను కొనబోయే క్రొత్తచీరెల్లో ఎట్లాకనిపిస్తుందో ఊహించుకుంటాడు. ముందుగా ఈమాట ఆమెతో చెపుతే ఏమంటుందో అని ఒక్కక్షణం ఆలోచనపోతుంది. ఒప్పుకోదు. వద్దంటుంది. తన్ను పంచె కొనుక్కోమంటుంది. అందుకనే అసలు చెప్పకూడదు అనుకు న్నాడు.

ఇద్దరూ కూర్చుని మాట్లాడుకుంటున్నప్పుడు కూడా తమ తమ కోర్కెలను మనస్సుల్లోనే అణచుకుని వుంటారు. నీకు ఇక్కడ సుఖంగా వుందా! ఈ ఇల్లు బాగుందా! ఏం చేస్తాను చెప్పు. నేను ఇంతకంటె

ఏమీ చెయ్యలేను. నేను బీదవాణ్ణి అంటూ జాలిగా వెంకటస్వామి గౌరి కళ్ళల్లోకి చూస్తాడు. గౌరికి ఎన్నో ఆలోచనలూ, కోర్కెలూ అయితే వున్నాయి. కాని వాటిని ఎట్లా చెప్పాలో తెలీదు. ఒట్టి అమాయక ప్రేమ అంతే. నాకు నీదగ్గరే బాగుంటుంది అంటూ పెనవేసుకుపోతుంది తనను. గౌరి మనస్సు పూర్తిగా అర్థంచేసుకున్నాడు. హఠాత్తుగా తను చీరె కొనుక్కొని తీసుకువస్తే గౌరి ఎంత సంతోషిస్తుందో ! ఏ విధంగా ఉద్రేకపడుతుందో ! ఆలోచించుకుంటూ కూర్చుంటాడు తను.

కాలప్రవాహం అనంతమయినది. ఆ ప్రవాహం ఒరవడికి కోసుకుపోయి ఎంతో మంది చదునై పోతారు, అదృశ్యులయిపోతారు. ఎక్కడో దూరాన కనిపిస్తున్నది ఇట్టే దగ్గరకు వచ్చేస్తుంది. భవిష్యత్తులో తీర్చుకోవాలసిన కోర్కెలు వర్తమానంలోంచి గతంలోకి పోయి మన స్మృతి పథంలోంచి కూడా తప్పించుకుపోతూ వుంటాయి. కాలం యొక్క వేగం అంత తీవ్రమైనది. అంత దారుణమయినది కూడా. ఈ ప్రేమికుల జీవితంలో ఒక్క ఏడాది త్రుటిలో జారిపోయిందంటే ఆశ్చర్యం లేదు. ఆనాడు వెంకటస్వామి సంతోషానికి అంతులేదు. తాను కూడ పెట్టుకున్న డబ్బుతో రేపే గౌరికి చీరె కొనటం. ఒక్కసారి తనివితీరా లెక్క పెట్టుకుంటే కాని ఆతనికి తృప్తిలేదు. రాత్రి పది గంటలయింది. గౌరి కన్నుమూస్తూ, తెరుస్తూ, కలత నిద్రలో వుంది. తనకు బాగా నిద్రవచ్చినట్లు ఇట్టే గుర్రుపెట్టడం మొదలుపెట్టాడు. గౌరి నిమీలిత నేత్రాల్లోని ముగ్ధసౌందర్యం తనివితీరా ఆస్వాదించాడు. ఆమెచేతిని మెల్లిగా తన చేతితో తీసి తాను పక్కమీద నుంచి చప్పుడు కాకుండా లేచాడు. గదిమూలకు అడుగుల్లో అడుగులు వేసుకుంటూ వెళ్లాడు. మెల్లగా పాతిపెట్టిన డబ్బాతీశాడు. డబ్బు లెక్క పెడుతున్నాడు. కళ్లు గిర్రున తిరిగిపోయినాయి.

గౌరి వెనకాలే వచ్చిన సంగతి అతను గమనించనేలేదు. ఒకటి రెండు రోజులబట్టీ, ఆమెకు ఏదో అనుమానం తలిగింది. అర్ధరాత్రి గది మూల చప్పుడవుతున్నట్లు పసికట్టింది. తీరా దుప్పటి తీసిచూస్తే ప్రక్కన భర్తలేడు. విపరీతంగా భయంవేసి మెదలకుండా పడుకునే వుంది. దాని విషయం ఏమిటో కనుక్కోవాలని ఇవ్వాళేమో దొంగనిద్ర పోయింది. డబ్బా పాతిపెట్టి మళ్లా భర్త వచ్చేటప్పటికి, తాను గట్టిగా నిద్రపోతున్నట్లే పడుకుని వుంది. భార్య మొహంలో మొహం పెట్టి నిద్రపోతున్న కళ్ళను ముద్దుపెట్టుకున్నాడు. పగలల్లా శ్రమపడ్డ వెంకటస్వామి ఎన్నడూ కూడా నిద్రపట్టటానికి ప్రయత్నం చెయ్యలేదు.

శ్రమజీవుల అలసట ఇంకా పూర్తిగా తగ్గకమునుపే, భళ్లున తెల్లవారిపోయింది.

వెంకటస్వామి కళ్లు నులుపుకుంటూ లేచాడు. అప్రయత్నంగా తనకళ్లు ఆ డబ్బామీదనే పడ్డాయి. కళ్లు చెదిరిపోయినాయి. నమ్మలేక పోయాడు. వీధి తలుపు భార్లగా తీసివుంది. ఆ డబ్బా మూలగా గిరాటు పెట్టి వుంది. మూత వీధి గుమ్మందగ్గర పడివుంది. దొంగ అంటూ గాభరాగా కేక పెట్టాడు. గౌరి అదిరిపడి లేచింది. ఇద్దరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. గౌరి ఆదరా బాదరాగా అటు ఇటూ తిరిగింది. ఈ డబ్బా ఏమిటి, ఇక్కడ గొయ్యి వుందే అంటూ ఆశ్చర్యంగా భర్తవంక చూసింది. ఆ క్షణంలో వెంకటస్వామికి హృదయచలనం ఆగినట్లనిపించింది. మొద్దుబారిపోయాడు. సమాధానం చెప్పడు. అతనికి పిచ్చి ఎత్తిపోయినట్లయింది. పోలీసుస్టేషనుకు వెళ్లాడు. విషయం అంతా చెప్పేశాడు. అతనికి ఫ్యాక్టరీకి వెళ్ళ బుద్ధిపుట్టలేదు. తీవ్రంగా ఆవేదన పడిపోతున్నాడు. అటూ ఇటూ పిచ్చివాడులాగ పచార్లు చేస్తున్నాడు. మనింటికి ఎవరొచ్చి

వుంటారు అని ఆలోచన పోయింది. ఇద్దరు ముగ్గురిమీద అనుమాన పడుతున్నాడు. తనతోపాటు ఫ్యాక్టరీలో పనిచేసే అచ్చయ్యమీద పూర్తిగా అనుమానం కలిగింది. చరచర ఇంటికి వచ్చేశాడు. దొంగదొరికాడని గౌరితో చెప్పాలనే ఆవేదనతో వచ్చేశాడు.

భార్యను చూడగానే, వెంకటస్వామి కళ్ళు జిగేలుమన్నాయి. పెళ్ళిలో కొనుక్కున్న నీలంచీరె కట్టుకుంది. తెల్లటి జాకెట్టు తొడుక్కుంది. మొహంమీద చెమికి తళతళ మెరిసిపోతోంది. జడనిండా మల్లెపూల వాసనలు ఘుమఘుమలాడి పోతున్నాయి చిరునవ్వులు పెదిమిల మీదికి వస్తూ పోతున్నాయి. భర్తను చూడగానే ఆవేశం, ఉద్వేగం హెచ్చిపోయినాయి. అతని కళ్ళలోకి అట్లాగే ఒక్కక్షణం పరీక్షగా చూసింది. అతనికి చెర్రుమన్నది.

'ఇవిగో నీకు బట్టలు...'మల్లుధోవతి, లాల్చి, రెండూ, రెండు చేతుల్తో పట్టుకుని వెంకటస్వామి హృదయం దగ్గరకు వచ్చింది.

'ఎక్కడివి!...' అంటూ ఆవేశంగా అన్నాడు. 'నువ్వు డబ్బాలో దాచుకున్న డబ్బుతో కొన్నా!...' అన్నది గౌరి హుందాగానూ, నిబ్బరంగానూ.

'గౌరీ!...' తడబడుతున్న పెదిమల సందుల్లోంచి వచ్చిన రెండు అక్షరాలూ గట్టిగా నిలబడ్డాయి, వెంకటస్వామి వక్షస్థలంమీద.

(పుస్తకప్రపంచం, అక్టోబరు 1960)